# ప్రేమతత్త్వమే దైవత్వము

సర్వరూపధరం శాంతం సర్వనామధరం శివం
సచ్చిదానంద మద్వైతం సత్యం శివం సుందరం!

ప్రేమస్వరూపులారా! సాయియొక్క శక్తిని, సాయి యొక్క సత్యమును, సాయియొక్క ప్రేమను, సాయి యొక్క శాంతమును గురించి ఎంతమందియో ఎన్నియో విధములుగా వర్ణిస్తున్నారు. కాని, వారు సాయియొక్క సందేశమును నిజంగా ఆచరణలో పెడుతున్నారా? పెట్టటం లేదు. అందువల్లనే ఇటీవల నేను మాట్లాడటం తగ్గించాను. అందరూ చెప్పేవారేగాని, చెప్పింది ఆచరించేవారు కనిపించటం లేదు. ఆచరించనివారికి ఎన్ని బోధించిన ప్రయోజన మేమిటి? ఈనాటి భక్తులు ఆధ్యాత్మిక గ్రంథాలను పఠిస్తున్నారు, వాటిలో ఉన్న విషయాలను కంఠస్థం చేసి ఇతరులకు బోధిస్తున్నారు. కాని, తాము ఆచరణలో పెట్టటం లేదు. ఆచరించకుండా ఇతరులకు ఎంత బోధించనప్పటికీ ఏమి ప్రయోజనం? కంఠస్థ ఉపన్యాసాలు కంఠశోషను కలిగిస్తాయే తప్ప లోకకళ్యాణమును చేకూర్చవు.

ప్రేమస్వరూపులారా! అనేకమంది అనేకరీతులుగా ఆధ్యాత్మికతత్త్వాన్ని గురించి ప్రబోధిస్తుంటారు. అయితే ఆధ్యాత్మికతత్త్వము పదములకు చిక్కేటటువంటిది కాదు. ఆధ్యాత్మికబోధనలను శ్రవణం చేసినంత మాత్రాన జన్మ సార్థకత నొందదు; ఆచరణయే దీనికి సరియైన మార్గము.

**మంచిచెడ్డలు రెండూ దైవనిర్ణయాలే!**

మహాభారత యుద్ధం జరుగుతున్న రోజులవి. అభిమన్యుడు తన తల్లియైన సుభద్రవద్దకువచ్చి, పద్మవ్యూహములో ప్రవేశించటానికి అనుమతిని, ఆశీస్సులను అర్థించాడు. అతనికి పద్మవ్యూహములో ప్రవేశించే విధానము మాత్రమే తెలుసుగాని, బయటికి వచ్చే విధానము తెలియదు. అందువలన, యుద్ధభూమికి వెళ్ళటానికి అది తగిన సమయం కాదని సుభద్ర అతనికి నచ్చజెప్పటానికి ప్రయత్నించింది "నాయనా! నా ఆశీర్వాదమునకు దైవ సంకల్పము కూడా తోడు కావాలి. ప్రతి ఒక్కటీ దైవసంకల్పానుసారమే జరుగుతుంది.

srisathyasaivachanamrutam

పద్మవ్యూహములో ప్రవేశించటం ప్రమాదకరమని తెలిసికూడా నీకు నేనెట్లు అనుమతి నీయగలను? పద్మవ్యూహాన్ని ఛేదించటం సామాన్యమైన విషయం కాదు. దానిని పన్నినవాడు శక్తియుతుడు, యుక్తిపరుడయిన ద్రోణాచార్యుడు.

*"తామర మొగ్గరంబు, బలదర్పిత శాత్రవ గర్వభంజనో*
*ద్దాముడు కుంభజుండు మరి దానిని పన్నినవాడు, భీష్మ సం*
*గ్రామము, భార్య గర్భవతి, కాలమెటుండునొ చెప్పలేము, నీ*
*మామయు తండ్రి లేరిచట, మానుము నీ తలపింక పుత్రకా!"*

అని సుభద్ర ఎంతగానో ప్రాధేయపడింది. అప్పుడు అభిమన్యుడు "అమ్మా! నా మామయైన శ్రీకృష్ణుడు లేనటువంటి స్థానమే లేదు" అన్నాడు.

ఒక్కొక్క సమయంలో భగవంతుని లీలలు చాలా విచిత్రముగా కనిపిస్తాయి. వీటివల్ల మానవులకు అనేక సందేహములు కలుగుతుంటాయి. సుభద్ర గర్భవతిగా ఉన్నప్పుడు ఒకనాడు అర్జునుడు పద్మవ్యూహంలో ప్రవేశించే విధానమును గురించి ఆమెకు వివరిస్తుండగా శ్రీకృష్ణుడు వచ్చి "అర్జునా! వింటున్నది సుభద్ర అనుకున్నావా? ఆమె గర్భములో ఉన్న శిశువు చక్కగా వింటున్నాడు. కాబట్టి యుద్ధమును గురించి మాట్లాడటానికి ఇది తగిన సమయం కాదు" అన్నాడు. అందువల్లనే అభిమన్యుడు పద్మవ్యూహంలో ప్రవేశించగలిగినాడుగాని, తిరిగి వచ్చే విధానము తెలియక ప్రాణాలు కోల్పోయినాడు.

మంచిచెడ్డలు రెండూ భగవంతుణ్ణి ఆశ్రయించి నటువంటివే! 'ఇది మంచిది, అది చెడ్డది' అని మీరు నిర్ణయించటానికి ప్రయత్నం చేస్తుంటారు. మంచికి 'ఎస్' అంటారు. చెడ్డకు 'నో' అంటారు. అయితే, మీకు ఏది మంచిదో, ఏది చెడ్డదో మీరు ఏరీతిగా నిర్ణయించగలరు? ఇది అసాధ్యము. మంచిచెడ్డలు రెండూ దైవనిర్ణయాలే! కొన్ని మీ దృష్టికి వికారంగానూ, కొన్ని మీ అభీష్టానికి విరుద్ధంగానూ గోచరించవచ్చును. కాని దైవసృష్టిలో అంతా సత్యం శివం సుందరమే! అట్టి తత్త్వమును మీరు ఏరీతిగా వర్ణించగలరు? బాహ్యదృష్టికి కొన్ని చెడ్డవిగా కనిపించవచ్చునుగాని, లోతుగా విచారణ చేసి చూస్తే వాటిలోనూ మంచి దాగిఉంటుంది. మీ

sri sathyasai vachanamrutam

దృష్టికి కొన్ని అందంగా కనిపిస్తాయి, మరికొన్ని అందవిహీనంగా గోచరిస్తాయి. అయితే ఈ ప్రపంచమంతయు అందచందములతో కూడినటువంటిదే! భగవంతుని సృష్టిలో ప్రతి ఒక్కటీ అందమైనదే! ఏ బిడ్డ ఆ తల్లికి అందంగానే కనిపిస్తుంది. దీనిని ఎవరైనా కాదనగలరా? ఇతరుల దృష్టికి అంత అందంగా కనిపించకపోయినప్పటికీ తల్లి దృష్టికి మాత్రం బిడ్డ చాలా అందంగా గోచరిస్తుంది. బిడ్డ అందచందములనుగురించి మాట్లాడే హక్కు తల్లికి తప్ప అన్యులకు లేదు.

భగవంతునిచే సృష్టింపబడిన ఈ జగత్తులో ఒకటి మంచిదని, మరొకటి చెడ్డదని మనం ఏరీతిగా నిర్ణయించగలము? ఇంత విశాలమైన జగత్తులో అణువు మొదలుకొని ఘనము వరకు ఏదైనా చెడ్డది ఉంటే చూపించండి చూద్దాం. అది సాధ్యమే కాదు, సాధ్యమే కాదు. అన్నింటిలోనూ మంచిచెడ్డలు కూడిఉంటాయి. వీటిని వీడదీయ ఎవ్వరి తరమూ కాదు. కాబట్టి, భగవత్తత్త్వాన్ని మన హృదయంలో నిల్పుకొని అన్నింటినీ ఆనందంగా స్వీకరించటమే మంచిదిగాని 'ఇది మంచిది, అది చెడ్డది' అని నిర్ణయించటానికి మనకు ఏమాత్రము అర్హత లేదు. దైవముయొక్క నిర్ణయాలు చాలా విచిత్రమైనవి.

*చిత్రంబులు త్రైలోక్య ప*
*విత్రంబులు భవలతా లవిత్రంబులు స*
*న్మిత్రంబులు మునిజనవన*
*చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్*

భగవత్తత్త్వాన్ని అర్థం చేసుకోవటానికి మీ మేధాశక్తి ఏమాత్రము పనికిరాదు. కాబట్టి, ఈ విషయంలో మీరు ఎటువంటి నిర్ణయాలకూ పూనుకోకూడదు.

**ప్రపంచమంతా ప్రేమమయమే!**

*సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖమ్*
*సర్వతః శ్రుతిమ ల్లోకే సర్వ మావృత్య తిష్ఠతి*

సర్వత్రా ఉన్న భగవంతుణ్ణి వెతకవలసిన అవసరమేమున్నది? అతని రూపము ప్రేమ స్వరూపము. అట్టి ప్రేమస్వరూపుని ప్రేమమార్గములోనే దర్శించుటకు, అనుభవించుటకు



sri sathyasai vahini vachanamrutam

వీలవుతుందికాని, అన్యమార్గములో సాధ్యము కాదు. దూషణ, భూషణ, తిరస్కార, పురస్కారములకు అతీతమైనటువంటిది ప్రేమతత్త్వం. శాంతము, సౌఖ్యము, ఆనందము, ఆహ్లాదములే ప్రేమయొక్క సహజగుణములు. ప్రేమయే దైవస్వరూపం. ప్రేమ లేనటువంటి స్థానమే లేదు. అండ, పిండ, బ్రహ్మాండమంతయు నిండినటువంటిది ప్రేమయే! ప్రేమవలననే మనం తింటున్నాము. ప్రేమవలననే మాట్లాడుతున్నాము. అన్నింటికీ ప్రేమయే ఆధారము. ప్రేమయే ప్రధానము. ఇటువంటి ప్రేమను అలక్ష్యం చేయటం ఎంత వెఱ్ఱితనము! ప్రేమను సర్వత్రా దర్శించాలి, ప్రేమను నిరూపించాలి, ప్రేమను అనుభవించాలి. ఈనాడు మనం ప్రేమనుగురించి మాట్లాడుతున్నామేగాని, ప్రేమను అనుభవించడం లేదు. ప్రేమతత్త్వము ప్రతి వ్యక్తియందు ఆత్మస్వరూపంగా నిలిచియున్నది. ఆత్మ స్వరూపంగా నిలిచియున్నది. ఆత్మ అనంతమైనది. కనుకనే "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అన్నది వేదము.

భగవంతుడు ఎక్కడున్నాడు? ఆత్మస్వరూపుడై తాను సర్వత్రా ఉన్నాడు. పరమభక్తుడైన ప్రహ్లాదుడు నిరంతరము శ్రీమన్నారాయణునిపై మనస్సు నిల్పి నామస్మరణ చేస్తూ వచ్చాడు. కనుకనే, అతడు సర్వత్రా నారాయణుని దర్శించగలిగాడు. ఈ ప్రపంచమంతయు విష్ణుమయమే! విష్ణువు ఇక్కడున్నాడు, అక్కడ లేడు అని చెప్పటానికి వీలుకాదు. ఎక్కడ చూసినా మనకు కనిపించేది విష్ణుస్వరూపమే! మీ కంటికి కనిపించేది ప్రపంచమనీ, పరమాత్ముడనేవాడు ఎక్కడో ప్రత్యేకంగా ఉన్నాడనీ మీరు భావిస్తున్నారు. ఈ ప్రపంచమంతా దైవమయయే అన్న సత్యాన్ని మీరు హృదయంలో నిల్పుకోవాలి. కంటికి కనిపించే దృశ్యాన్ని చూసి మీరు భ్రాంతిలో మునగకండి. మానవునికి ప్రత్యేకమైన శక్తి ఏదీ లేదు. దైవశక్తియే అతనిని నడిపిస్తున్నది. కనిపించే శక్తి అంతయు దైవానిదే! అటువంటి దైవశక్తిని విస్మరించి మానవుడు తాను ఏదో సాధిస్తున్నానని భావించి అహంకారపడటం ఎంత అన్యాయం! ఇలాంటి పరిస్థితిలో మానవుడు ఇది సత్యమనీ, అది అసత్యమనీ, ఇది మంచిఅనీ, అది చెడ్డఅనీ నిర్ణయించడానికి వీలుకాదు. తాను నిర్ణయించాలనుకుంటే.. తాను చూసిందీ, చూస్తున్నదీ, చూడబోయేదీ అంతా మంచియేనని భావించాలి.

భగవంతుడు సర్వత్రా కనిపిస్తున్నాడు. అటువంటప్పుడు చెడు అనేది ఎలా ఉండగలదు? మీ భావాలలోని చెడును భగవంతునికి ఆపాదించటం తగదు. గ్రంథపఠనంచేత గాని, లౌకికమైన

sri sathyasai vahanamrutam

విద్యల చేతగాని, వర్ణనలచేతగాని, గురువులచేతగాని భగవత్తత్త్వాన్ని ఇదీ అని నిర్ణయించుటకు సాధ్యం కాదు. మునులకు, ముల్లోకాలకుకూడా అతీతమైనది భగవత్తత్త్వం. ఇట్టి దైవత్వాన్ని మీరు ఏరీతిగా అర్థంచేసుకోగలరు? మీరు సాక్షాత్తు శ్రీమహావిష్ణువును దర్శించామనుకుంటారు. ఆ విష్ణువు మీకు ఏరీతిగా కనిపించాడు? శంఖ, చక్ర, గదాధారియై కనిపించాడంటారు. అది కేవలం మీ భావాకారమేగాని, సత్యమైన ఆకారము కాదు. కాని, అటువంటి ఆకారమునే మీరు సత్యంగా భావిస్తున్నారు.

మీ ఎదురుగా ఒక సర్పము కనిపిస్తే, అది విషపురుగని మీరనుకుంటారు. కాని మీ ఎదురుగా వచ్చే వ్యక్తియొక్క తలంపులూ, మాటలూ, చేష్టలూ, దృష్టీ.. అన్నీ విషమయంగా ఉన్నప్పటికీ అతనిని మీరు మనిషిగానే భావిస్తారు. నిజం చెప్పాలంటే, ఆ సర్పముకంటే ఈ మనిషే ప్రమాదకరమైనవాడు. ఇటువంటి విషయాలను మహాభారతము చాలా విపులంగా వివరించింది. మహాభారతములోని సూత్రములు చాలా పవిత్రమైనవి. జీవితమునకు కావలసిన ఆదర్శములను, కర్తవ్యములను మహాభారతము చక్కగా నిరూపించినది. మహాభారతము నందున్న అంతరార్థమును గుర్తించి వర్తించే వ్యక్తియే నిజమైన మనిషి. మానవుడు తనకున్న పరిమితజ్ఞానముచేత ఇది మంచి, అది చెడ్డ అని నిర్ణయించటానికి వీలుకాదు. కాబట్టి అన్నింటికీ మౌనం వహించి, సత్యమైన తత్త్వాన్ని అనుసరించటానికి ప్రయత్నించటము గొప్ప వివేకము. మంచిని చెడుగా భావించటం చాలా తప్పు. చెడులోకూడా మంచిని స్వీకరించటానికి ప్రయత్నించాలి.

*మంచిచెడ్డలు రెండును కలసియుండు*
*వీని విడదీయ ఎవ్వరి వశము కాదు*
*మంచిని ప్రత్యేకముగ ఎందు చూడబోము...*

కాబట్టి, మంచిచెడ్డలను సమచిత్తముతో స్వీకరించాలి. అప్పుడే మనలో ఉన్న సత్యతత్త్వము బహిర్గతమౌతుంది.

ప్రేమస్వరూపులారా! మీ అందరిలోనూ ప్రేమ ఉన్నది. మీ నఖశిఖపర్యంతం ప్రేమయే తాండవమాడుచున్నది. ఈ ప్రేమతత్త్వాన్ని గుర్తించటానికి మీరు ప్రేమనే పెంచుకోవాలి.

srisathyasaivachanamrutam

లోకములో ఎన్నియో రూపములు కనిపిస్తున్నవి. అన్ని రూపములుకూడను ఒక్క దైవముయొక్క అంశములే! అన్నీ దైవముయొక్క వివిధ రూపములే! కాబట్టి, ఒకటి మంచిదని, మరొకటి చెడ్డదని నిర్ణయించటానికి ఏరీతిగా వీలవుతుంది? అన్నీ మంచివే! ఫలమును భుజించినప్పుడు అది మంచిగానే ఉంటుంది. కాని, అది మలంగా మారి బయట పడినప్పుడు చాలా అసహ్యంగా కనిపిస్తుంది. మంచిచెడ్డలు మీ ఇష్టాయిష్టములపైన ఆధారపడి ఉంటున్నాయి. మీ ఇష్టముపైన మీరు ఆధారపడకూడదు. అన్నింటినీ దైవముయొక్క ఇష్టానికి వదలిపెట్టాలి. మీకు అన్నివిధములుగా ఏది మంచిదో తానే నిర్ణయించగలడు. కాబట్టి భగవంతునియొక్క ఆశ్రయాన్ని మీరు పొందండి.

ప్రేమస్వరూపులారా! దైవముయొక్క ప్రేమతత్త్వాన్ని వర్ణించటానికి వీలుకాదు. ఎన్ని విధములుగా వర్ణించినప్పటికీ అది అసంపూర్ణంగానే తోస్తుంది. కాబట్టి వర్ణించడానికి ప్రయత్నించక మీలో ప్రేమను పెంచుకోండి. ప్రేమయే పరమాత్మస్వరూపము. ఏ రూపము ధరించినప్పటికీ అది ప్రేమనే! ప్రేమయే మీ గమ్యము. ప్రేమను పెంచుకున్నప్పుడే మీ జన్మ ధన్యము. ప్రేమయే మీ నిజస్వరూపము. కాబట్టి, ప్రేమను పెంచుకోవటానికి మీరు ప్రయత్నించాలి. ఆ ప్రేమయే మిమ్మల్ని సర్వవిధములుగా కాపాడుతుంది. అయితే, ప్రేమను దేహముపై ప్రసరింపజేసినప్పుడు అది Attachment గా రూపొందుతుంది. కాబట్టి దేహాభిమానమును పెంచుకోకూడదు. యౌవనంలో దేహము చాలా అందంగా కనిపిస్తుంది. వృద్ధాప్యంలో వికారంగా రూపొందుతుంది. మొదట మీ దృష్టికి ఏది అందంగా కనిపిస్తుందో అదే చివరికి వికారంగా మారిపోతుంది. ఈరీతిగా మీ దేహము మార్పు చెందుతుందిగాని, ప్రేమ మాత్రం ఎప్పటికీ ఒక్కటే!

ప్రేమస్వరూపులారా! ప్రేమనుగురించి వివరించటానికి సాధ్యం కాదు. ప్రేమ అందరినీ ఆకర్షిస్తుంది. ప్రేమకు ఒక్కటే రూపమున్నది. అదే సర్వులనూ ఆకర్షించే ప్రకృతి. కృష్ణుడు ప్రేమస్వరూపుడు. కనుకనే 'కర్షతీతి కృష్ణః' అన్నారు. అనగా భగవంతుడు అందరినీ ఆకర్షించేటటువంటివాడు, ఆనందింపజేసే టటువంటివాడు. 'మధురాధిపతే అఖిలం మధురం.' మనం ఎన్నో రకాలైన మిఠాయిలను చూస్తుంటాము. అన్నింటిలోనూ ప్రధానంగా ఉన్నటువంటిది ఏమిటి? అదే మాధుర్యము. అదే భగవంతుని స్వరూపము. మనం ఈ ప్రకృతిని ప్రేమిస్తున్నాము,



srisathyasaivachanamrutam

ఆనందముగా అనుభవిస్తున్నాము. మనం ప్రేమించే ఈ ప్రకృతి మనకు ఏవిధంగా కనిపిస్తున్నది? వివిధ రూపములతో కనిపిస్తున్నది. రూపములు వేరైనప్పటికి అన్నింటిలో ఉన్న దివ్యత్వము మాత్రము ఒక్కటే! భగవంతుడు ఒక ప్రత్యేకమైన రూపముతో ప్రత్యక్షము కావాలని మీరు ఆశించకూడదు. మీరు ఎక్కడికి వెళ్ళినా, ఏది చూసినా అదంతా దైవమే! అట్టి ప్రేమతో మీరు భగవంతుణ్ణి సర్వత్రా దర్శించటానికి ప్రయత్నం చేయాలి. అప్పుడు సర్వం ప్రేమమయమే! ప్రేమను పెంచుకోకుండా దైవత్వాన్ని అనుభవించాలనుకోవటం చాలా పొరపాటు.

*ప్రేమరహిత మరుభూములలో*
*ప్రేమాంకురములు పెంపొంద*
*ప్రేమావేశముతో...*
*ప్రేమసుధావర్షము వర్షింపగ*
*ప్రేమనదులు ప్రవహింపగ*
*మురళీగానము సేయగదె!*
*కృష్ణా! గానము సేయగదె!*

అని గోపికలు కృష్ణుని ప్రార్థిస్తూ వచ్చారు. మీరందరూ ప్రేమసుధాబిందువులే! అనేక బిందువులు చేరి ఒక వంక ఏర్పడుతుంది. కట్టకడపటికి అది సాగరములో లీనమైపోతుంది. కాని ఈనాటి మానవునికి ప్రేమ అంటే ఏమిటో అర్థం కావటం లేదు. ఒక వస్తువును తాను ఇష్టపడితే, అది ప్రేమ అనుకుంటున్నాడు. అది ఇష్టమేకాని ప్రేమ కాదు. ఇష్టమనేది వచ్చినప్పుడు అయిష్టముకూడా దానిప్రక్కనే వస్తుంది. కాని ప్రేమ ఉన్నప్పుడు దానికి విరుద్ధమైనది మరొకటి ఉండదు. ప్రేమకు ఏనాడూ మార్పు లేదు. అటువంటి ప్రేమతత్త్వమే దైవత్వము. ఇంక, మీరు ఎన్ని విధములుగా వర్ణించినప్పటికీ ఆ వర్ణనలన్నీ మీ భ్రాంతులే తప్ప సత్యస్వరూపములు కావు. "ఏకం నిత్యం విమలం అచలం సర్వధీ సాక్షీభూతం భావాతీతం త్రిగుణరహితం" అదియే భగవత్తత్త్వం. అదియే ప్రేమతత్త్వం. ఇట్టి ప్రేమను ప్రాపంచికమైనరీతిలో వర్ణించటానికి వీలుకాదు. ప్రేమను ప్రాపంచికమైనకరీతిగా భావించటం వెఱ్ఱితనం. ప్రేమకు సమానమైన పదము మరొకటి లేనే లేదు. మన తృప్తి నిమిత్తమై మనం అనేక పేర్లు

srisathyasaivachanamrutam

పెట్టుకుంటున్నాముగాని, ఏదీ సత్యము కాదు. ప్రేమకు ప్రేమ ఒక్కటే సత్యము. దీనిని ఇంకొకరీతిగా మార్చటానికి వీలుకాదు. అట్టి ప్రేమకు అనేక రూపములు కల్పించుకొని భ్రమించటం పొరపాటు.

ప్రేమస్వరూపులారా! ప్రేమతత్త్వాన్ని మనం ఎంత అభవించినప్పటికీ తనివితీరదు; దానిని తనివితీర అనుభవించటానికి వీలేకాదు. ప్రేమను అనుభవించటానికి ప్రేమ తప్ప మరొక మార్గమే లేదు. ప్రేమ ప్రేమనే! కాబట్టి, దైవాన్ని ప్రేమస్వరూపునిగా భావించి ఆయనను ప్రేమించండి. ఏవో మీరు కల్పించుకున్న ప్రేమలను భగవంతునిపై రుద్దకండి. సత్యనిత్యమైనది భగవత్ప్రేమ ఒక్కటే! అట్టి ప్రేమతత్త్వాన్ని మీరు ప్రేమతోనే అనుభవించాలి. దైవత్వమునందే ఆ ప్రేమ ప్రకటితమవుతుంది. మీ ప్రేమను దైవముపైనే ప్రసరింపజేయాలి. ఎక్కడ చూసినా వ్యాపించి ఉన్న ప్రేమతత్త్వమే భగవత్స్వరూపము. అవునా, కాదా అన్న ప్రశ్నకు ఇక్కడ అవకాశమే లేదు. మీకు కావాలంటే చెప్పండి, ఏ నిమిషమైనా ఎక్కడైనా నేను చూపుతాను. మీరు సులభంగా చూడవచ్చు. అయితే, మొదట ప్రేమను మీలో ప్రవహింపజేసుకోవాలి. ఆ ప్రేమను నిత్యసత్యమైనటువంటిదిగా నిల్పుకోవాలి. అప్పుడే మీకు చూపటానికి వీలవుతుంది. మీరు చూడాలి, చూడాలి అని ఆశపడుతున్నారు. కాని మీ ప్రేమను మాత్రం సంకుచితమైనదిగా పెట్టుకుంటున్నారు.

ప్రేమస్వరూపులారా! నేను ఎప్పుడూ ప్రేమ, ప్రేమ, ప్రేమ.. అంటూ ప్రేమనే ప్రబోధిస్తున్నాను. కాని, ఆ ప్రేమ ఇట్టిది, అట్టిది అని మీరు వర్ణిస్తున్నారు. అది కేవలం మీ ఊహాగానము మాత్రమే! నిజంగా ప్రేమను వర్ణించటానికి ఎవరికీ సాధ్యం కాదు. ప్రేమకు ఒక్కటే రూపము. ఆకర్షణయే ప్రేమస్వరూపము. ఆనందింపజేయటమే ప్రేమతత్త్వము. అనుగ్రహాన్ని అందించటమే ప్రేమ స్వభావము. ప్రేమయే దైవం. కాబట్టి ప్రేమలో జీవించండి. ప్రేమతత్త్వాన్ని మరొక దినము మీకు పూర్తిగా వివరించి బోధిస్తాను. ఈ లోకంలో కనిపించే ప్రేమ కేవలం కల్పితమైనది. ఇటువంటి ప్రేమయే సత్యమని భావించి, అందులోనే ఆనందమున్నదని భ్రమిస్తున్నారు. ఇదెంత వెఱ్ఱితనము! ఈనాడు మనం ప్రేమించేదంతా నెగెటివ్! మనం నిజంగా ప్రేమించవలసింది పాజిటివ్! అది ఏనాటికీ మార్పుచెందదు. ఒక చిన్న ఉదాహరణము. మీరు ఎన్నో సంవత్సరాలనుంచి ఇక్కడికి వస్తున్నారు. మొన్న చూసిన

sri sathyasai vahanamrutam

స్వామే కదా, అని మీకేమైనా విసుగు పుడుతున్నదా? లేదు. పొద్దున్న వచ్చిన స్వామియే సాయంకాలంకూడా వస్తుంటాడు. కాని, ఎన్ని తూర్లు చూసినా నన్ను మళ్ళీ చూడాలని ఆశిస్తున్నారు. దానికి కారణం ఒక్కటే. అదే ప్రేమ!

(2004 ఏప్రియల్ 15వ తేదీ సాయంత్రం బృందావనం సాయిరమేశ్ హాలులో భగవాన్ దివ్యోపన్యాసం)

sri sathyasai vachanamrutam